


# సత్యవాక్కు

సంపుటి -42 అక్టోబరు - 2020 సంచిక - 3

Oct 2020

అక్టోబరు - 2020

## క్రైస్తవ మాసపత్రిక

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| గురువారంమధ్యాహ్నం | : | 2.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| శుక్రవారం ఉదయం | : | 6.30 ని॥లకు MAHAA NEWS ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్ష్మీగూటం |
| | | రోపి గూటం |

Youtube లో satyavanicoc. kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

SATYA VANI

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. ph : 0884 - 2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ

ఆంధ్రప్రదేశ్ - 533 001



ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547

ఎడిటర్ : జాషువా గూటం



క్రొత్త నిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 అక్టోబరు - 2020 సంచిక -3


## మొదటి క్రీస్తు సంఘము

అపో.కా. 2:42-47 లో మొదటి క్రీస్తు సంఘమును గూర్చి యిట్లు వ్రాయబడినది. మొదటి దినమున అపో. పేతురు చెప్పిన వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. "ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి. వీరు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టెవిరుచుట యందును, ప్రార్ధన చేయుట యందును, ఎడతెగక యుండిరి. అప్పుడు ప్రతివానికి భయము కలిగెను. మరియు అనేక మహత్కార్యములును సూచక క్రియలును అపొస్తలుల ద్వారా జరిగెను. విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చర స్థిరాస్థులను అమ్మి అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి. మరియు వారేకమనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు దేవుని స్తుతించుచు ప్రజలందరివలన దయపొందిన వారై ఆనందముతోను, నిష్కపటమైనహృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు

ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను."

అపొస్తలుల కార్యముల గ్రంధములో బయలుపరచబడిన సంఘమును గూర్చి లోకము ఆశ్చర్యపడుచున్నది. యుగముల తరబడి దానిని చూడవలెనని మానవులు అపేక్షించిరి. ఈనాడు మేమయితే దానిని పునరుద్ధరించుటకు పూనుకొని యున్నాము. మనము ఇంతకు ముందు చదువుకొనిన కొన్ని వచనములలో మొట్టమొదటి క్రీస్తు సంఘము యొక్క గుణలక్షణములు మనకు వర్ణించబడినవి. వాటిని మనము జాగ్రత్తగా గమనించిన యెడల ఈ రోజు వాటి నుండి కొన్ని మంచి పాఠములను నేర్చు కొనగలము.

**మొదటి క్రీస్తు సంఘము నేర్చుకొను సంఘమై యుండెను;** వారు అపోస్తులులు బోధయందు నిలకడగా యుండిరి. మొదటి శతాబ్ధములో స్థాపించబడిన సంఘమే మేమని ఈనాడు ఏ సంఘమయినా చెప్పుకొనుచున్న యెడల అది బైబిలును పఠించునట్టియు, బైబిలును బోధించునట్టియు, పాటించునట్టియు సంఘమై యుండవలెను.

**మొదటి క్రీస్తు సంఘము సహవాసము గల సంఘమై యుండెను.** వారు సహవాసమందు నిలకడగా యుండిరి. వారందరూ ఒకే కుటుంబమునకు, దేవుని కుటుంబమునకు చెందిన సభ్యులు. క్రీస్తు నందు వారందరు సోదర సోదరీలు. "ఒక్కడే మీ తండ్రి, ఆయన పరమందున్నాడు. మీరందరూ సహోదరులు అని యేసు బోధించెను" (మత్తయి 23:8).

**మొదటి క్రీస్తు సంఘము ప్రార్ధించు సంఘమై యుండెను;** వారు ప్రార్ధన యందు యెడతెగక నిలకడగా యుండిరి. వారు ప్రార్ధించునప్పుడు దేవునియందున్న విశ్వాసమును ఒప్పుకొను చుండిరి, ఆయనపై వారు ఆధారపడి యున్నట్లు ప్రార్ధించిరి. మరియు వారి ప్రార్ధనలకు ఆయన జవాబిచ్చునని కూడా విశ్వసించి ప్రార్ధించుచుండిరి.

యూదుల అధికారులును, పెద్దలును, శాస్త్రులును, పేతురు, యోహానులను పట్టుకుని మీరు యేసు నామమును బట్టి యెంతమాత్రమును మాటలాడకూడదు, బోధింపకూడదని వారి కాజ్ఞాపించిరి. అయితే వారు తమ స్వజనులతో కలసికొని యేక మనస్సుతో దేవుని నామము మహిమ పరచబడునట్లును, వారు బహు ధైర్యముగా వాక్యము బోధించగల్గునట్లును సహాయము చేయుమని ప్రార్థించిరి (అపో.కా.4:5-31).

**మొదటి క్రీస్తు సంఘము భయ భక్తులు కలిగిన సంఘము;** అప్పుడు ప్రతివానికిని భయము కలిగెను అని వ్రాయబడి యున్నది. వారు సజీవుడైన దేవుని సేవించువారు. ఆయన తన కుమారునిపంపి వారిని తమ పాపముల నుండి విమోచించెను. వారాయన రాజ్యమైన సంఘములో యుండిరి. కావున అపో.పౌలు వారిని ఇట్లు హెచ్చరించెను. "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవ కృప కలిగి యుందము. ఆ కృప కలిగి వినయ, భయ భక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము, ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:28, 29).

**మొదటి క్రీస్తు సంఘము క్రియా జనాత్మక సంఘమై యుండెను:** అనేక మహత్కార్యములును, సూచక క్రియలును అపొస్తలుల ద్వారా జరిగించబడెను. ఈనాడు అట్టి మహత్కార్యములు, సూచక క్రియలు ఏమియు జరిగించబడక పోయినను, క్రీస్తు సంఘమున్నచోట పని జరుగుట కనపడును. నిజ క్రైస్తవులు ఎక్కడ ఉన్నను [illegible] సంపాదించుటలోను, పరిచర్య చేయుటలోను, కృషి చేయుట లోను బోధించుట లోను, విశ్వాస సంబంధమైన మంచి పోరాటమును పోరాడుటలోను నిమగ్నులై యుందురు. క్రీస్తు సంఘము ఎక్కడ ఉన్నను అది క్రియాజనాత్మక సంఘమై యుండును.

**మొదటి క్రీస్తు సంఘము పంచుకొను సంఘమై యుండెను:** విశ్వసించిన

వారందరూ ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చరస్థిరాస్థులను అమ్మి అందరికి వారి వారి అక్కర కొలది పంచిపెట్టిరి.

మొదటి క్రీస్తు సంఘములు ఇచ్చే వారుగాని పుచ్చుకొనే వారు కాదు. పుచ్చుకొనుట కంటె ఇచ్చుట మేలని క్రీస్తు వారు చేసిన బోధను వారెరిగియుండిరి. మొదటి క్రైస్తవులు స్వార్ధపరులు కారు. స్వార్ధపరుడు క్రైస్తవుడు కాజాలడు, తనకువలె తన పొరుగువానిని ప్రేమించలేడు. మొదటి క్రీస్తు సంఘము స్వార్ధము గల సంఘము కాదు. వారు పంచిపెట్టే వారు, తమకు కలిగిన వాటిని పంచుకొనేవారు.

**మొదటి సంఘము ఆరాధించే సంఘమై యుండెను:** వారేక మనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు దేవుని స్తుతించుచుండిరి. వారు రొట్టె విరుచుటలో అనగా ప్రభు రాత్రి భోజనము నాచరించుటలో యెడతెగక నిలకడగా యుండిరి. ప్రభు రాత్రిభోజనమును వారు ప్రతి ఆదివారమున జరిగించుచుండిరి. (అపొ.కా. 20:7).

క్రీస్తు చేసిన బలియాగమును జ్ఞాపకముంచుకొనుటకు గాను వారు దానినాచరించుచుండిరి. (1కొరింథి 11:27-29). వారి ఆరాధన సత్యారాధనయై యుండెను. దానిని వారు ఆత్మతో జరిగించుచుండిరి. ఆరాధనలో వారు పాటలు పాడిరి, ప్రార్ధన చేసిరి, అపొస్తలులు బోధను వినిరి, ప్రభు రాత్రి భోజనము నాచరించిరి, కానుకలిచ్చిరి. వారి ఆరాధన దేవునికంగీకార యోగ్యమైనదై యుండెను.

మొదటి క్రీస్తు సంఘము ఆనందముతో కూడిన సంఘమై యుండెను. వారు ఆనందముతోను, నిష్కపటమైన హృదయము తోను ఇంటింటా ఆహారము పుచ్చు కొనుచుండిరి. క్రీస్తు సంఘము స్థాపింపబడక కొన్ని వందల సంవత్సములకు ముందే యెషయా ప్రవక్త దానిని గూర్చి యిట్లు

ప్రవచించెను: "కావున మీరు ఆనందపడి రక్షణాధారములైన బావులలో నీళ్ళు చేదుకొందురు. ఆ దినమున మీరీలాగందురు, యెహోవాను స్తుతించుడి, ఆయన నామమును ప్రకటించుడి" (యెషయా 12:3,4).

**మొదటి క్రీస్తు సంఘము ప్రజలందరి యిష్టమును చూరగొన్నట్టిది:** వారు ప్రజలందరివలన దయను పొందిరి. నిజ క్రైస్తవ్యము ప్రేమను జనింపజేయునట్టిది. వారి రక్షకుడైన యేసుక్రీస్తు మనుష్యుల దయ యందును, దేవుని దయ యందును ఎట్లు పెరిగెనో, అట్లే మొదటి క్రైస్తవులు కూడాను (లూకా 2:52). వారు దేవుని దయను, మనుష్యల దయను కూడా చూరగొనిరి. నిజక్రైస్తవులున్నచోట ప్రేమ, విశ్వాసము, దయ తప్ప మరొకటి యుండదు.

**మొదటి క్రీస్తు సంఘము దిన దినాభివృద్ధి జెందుచున్నట్టి సంఘమై యుండెను:** మరియు రక్షణ పొందుచున్నవారిని ప్రభువు అనుదినము వారితో చేర్చుచుండెను. గనుక వారి సంఖ్య దినదినము విస్తరించుచుండెను. అయితే ఈ రక్షణ పొందుచున్న వారెవరు? వారు యేసుక్రీస్తునందు విశ్వసించినవారు, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందినవారు, యేసు ప్రభువని తమ నోటితో ఒప్పుకొన్నవారు, పాప క్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందినవారు.

మొదటి క్రీస్తు సంఘమే ఈనాడు మన మధ్య ఉన్నది. మొదటి శతాబ్దములో వారివలెనే నీవు కూడా యేసుప్రభువును నమ్ముకొని బాప్తిస్మము పొందిన యెడల, ఆ ప్రభువే నిన్ను తన సంఘముతో చేర్చుకొనును. మొదటి క్రీస్తు సంఘస్తుని వలెనే నీవు కూడా దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించ వచ్చును. ఈ రోజే మీ గ్రామములో యున్న క్రీస్తు సంఘమును దర్శించండి. లేదా మాకు ఒక జాబు వ్రాయండి.

# ఆరాధన అనగాయేమి?

క్రైస్తవులు చేయు ప్రాముఖ్య విధులలో ఆరాధన ఒకటియై యున్నది. ఆధునిక ఆరాధనలో మానవులు దేవుని వాక్యాధారము లేని లనేక సంగతులను కల్పించారు. అందువలన మాట చేత గాని, క్రియ చేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతాజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి"యని అపొ.పౌలు చెప్పాడు (కొలస్స 3:17).

యేసు పేరట ఏదైనా చేయడం అంటే ఆయన అధికారము చొప్పున చేయుట. బైబిలు ఆధారమే లేని ఆరాధన వ్యర్థము అనగా నిష్ప్రయోజనము (మత్తయి 15:9). గనుక బైబిలు సంబంధమైన ఆరాధనలో యేమేమి ఉన్నదో తెలిసికొని మనము చేయు ఆరాధన దేవునికి అంగీకార యోగ్యముగా యుండునట్లు చూచుకొనవలెను.

### ఆరాధన అనగాయేమి?

క్రొత్త నిబంధనలో వాడబడిన ఆరాధన అను పదమునకు వంగి నమస్కరించుట సాగిలపడుట లేక అమితమైన భక్తి గౌరవములను చూపుట యని అర్థము. అది భక్తిని, గౌరవమును, విధేయతను చూపుట. యోహాను 4:23-24 ఆరాధనను గూర్చి ఇట్లు చెప్పుచున్నది: "యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించు వారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు ఆత్మ గనుక ఆయనను

ఆరాధించు వారు ఆత్మతోను, సత్యము తోను, ఆరాధింపవలెను". యధార్ధముగా ఆరాధించు వారిని గూర్చి యేసు చెప్పినందున యధార్ధముగా ఆరాధింపని వారుందురని మనకు గ్రాహ్యా మగుచున్నది.

**మనము తండ్రియైన దేవుని ఆరాధించాలి.** యిది ప్రేమను సన్నిహితత్వాన్ని సూచించుచున్నది. (ఎఫెసి 1:3; లూకా 11:2-4). అయినను దేవుని యెడల మన కుండవలసిన భక్తి భావములు, సంభ్రమాశ్చర్యములు కొనసాగుచుయుండాలి. ఆయన యెడల ఇట్టి భావములకు ఆయన అర్హుడు. ఆరాధన ఆత్మతోను, సత్యముతోను యుండాలి. ఆత్మతో కూడిన ఆరాధన హృదయ పూర్వకముగా నిష్కపటముగా యుండును మరియు దేవుడు తన వాక్యములో చెప్పిన రీతిగా చేయుట సత్యారాధనయై యుండును."నీ వాక్యమే సత్యము" అని యేసు చెప్పారు (యోహాను 17:17). గనుక సత్యముతో ఆరాధించుట యనగా ఆయన చెప్పినట్లు చేయుటయే.

దేవుని ఘన పరచు క్రియ ఆరాధన యైయున్నది. ఆరాధింప బడవలసిన వాడు దేవుడే గాని మానవుడు కాదని మనము గ్రహించుకోవాలి. దేవుడెవరోయని తెలుసుకొని ఆయనను గుర్తించుట నీవెవరోయని గుర్తించుట; తదనుగుణంగా స్పందించుటయే [illegible]యని ఒకాయన అన్నారు. యిది ఒక సూక్ష్మ నిర్వచనం. ఈ పాఠంలో దానిని మూలముగా వినియోగించుటకు ప్రయత్నించుదాం.

**ఆరాధనలో దేవుడెవరో తెలుసుకొని గుర్తించుట ముఖ్యము :** దేవుడు సృష్టికర్త. ఆయన భూమ్యాకాశములను అందలి సమస్తమును సృజించినాడు (ఆది.కా. 1:1; కొలొ[illegible]). ఆయన



ఆరాధించుచున్నారు. గాని వారి జీవితములో పరిశుద్ధత లేదు. గనుక దేవుడు వారి ఆరాధనను తిరస్కరించారు.

**ఆరాధన యొక్క ప్రయోజనములు**
**ఆరాధన యొక్క రెండవ ఉద్దేశ్యము సహోదరులను హెచ్చరించుటయే:**

"కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు ఆదినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్పవలెను" (హెబ్రీ

"సమస్తమును క్షేమాభివృద్ధి కలుగుటకై జరుగనియ్యుడి" యని కొరింధులోని సంఘమునకు అపొ. పౌలు సలహాయిచ్చాడు. (1కొరింధీ 14:26). క్షేమాభివృద్ధి పెరుగుదలను సూచించుపదము1 కొరింధీ 1 లో 7 సార్లు వినియోగించబడెను. ఆరాధనలో యున్న లోపములను ఆత్మీయ వరములను గూర్చిన లోపములను సరిదిద్దుటకు పౌలు కొరింధీయులకు పత్రికలు వ్రాసాడు. అయినను సంఘము యొక్కయు క్రైస్తవుల యొక్కయు క్షేమాభివృద్ధియే ముఖ్య ఉద్దేశ్యము.

ఆరాధన యొక్క మరియొక ఉద్దేశ్యము

ఒక్కడే నిజమైన దేవుడు (నిర్గ 20:2-3). ఆయన సంపూర్తిగా యదార్థవంతుడు, నీతిమంతుడు, న్యాయవంతుడు (మార్కు 10:18). ఆయన ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు అని యెషయా చెప్పినప్పుడు ఈ సత్యాన్ని వక్కాణించుచున్నాడు (యెషయా 1:4; 43:15). ఇది ఒక విపరీత విరుద్ధము. పరిశుద్ధుడు మన మధ్య యున్నాడు. "సీయోను నివాసీ ఉత్సాహ ధ్వని బిగ్గరగా చేయుము. నీ మధ్య నున్న ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు ఘనుడైయున్నాడు" (యెషయా 12:6).

ప్రవక్తయైన యెషయా దైవ దర్శనమును పొందిన తరువాత "అయ్యో అపవిత్రమైన పెదవులు గలవాడను'' అని అరిచాడు (యెషయా 6:5). మనము తరచు నీతిమంతులుగా సద్వర్తనులుగా ఎంచుకొనుచున్నను దేవునితో పోల్చినపుడు మనమ పాపతుల్యులము. దేవుని పరిపూర్ణ స్థాయి అది. మానవుని మంచితనము కంటే ఎంతో ఉన్నతమైనది. గనుక ఆరాధనలో ఒకడు తన పాపపు తత్వాన్ని అనర్హతను గుర్తిస్తాడు. దేవుని సమీపించుటకు అతని అయోగ్యతను గుర్తిస్తాడు. (లూకా 5:8; యెష 6:5). యిది ఆరాధించు వాని హృదయములో కృతజ్ఞతను వినయమును ప్రోత్సహిస్తుంది.

మూడవదిగా మనము సరియైన విధముగా స్పందించాలి. సరియైన స్పందన అనగా ఏమిటి? ఇందులో అనేక సంగతులు ఇమిడియున్నాయి.

1. మనము వినయ విధేయతలు కలిగి దేవునిపై ఆధారపడాలి.


2. కృతజ్ఞతా భావము కలిగియుండాలి. మానవుడు కృతజ్ఞత కలిగియుండాలని బైబిలు ప్రోత్సహించుచున్నది. మన ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి ఎల్లప్పుడు కృతజ్ఞత చెల్లించుచు యుండాలి (ఎఫెసి 5:20). 3. అట్లే మనము సంతోషముతో నిండి యుండాలి. "ప్రభువునందు ఎల్లప్పుడును ఆనందించుడి మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4:4). "కాగా మీరు పరిశుద్ధాత్మ శక్తి పొంది, విస్తారముగా నిరీక్షణ గలవారగుటకు దేవుడు విశ్వాసము ద్వారా సమస్తానందముతోను సహనముతోను మిమ్మును నింపును గాక" (రోమా 15:13). 4. ఆయన చిత్తముకు మనము సంపూర్తిగా సమర్పించుకొనవలెను. "కాబట్టి బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది."

అన్నీ కరెక్టుగా ఆరాధించితే సరిపోదు. అది పవిత్ర జీవితమునకు నడిపించాలి. మన జీవిత విధానము నుండి మన ఆరాధనను వేరు చేయలేము. పరిశుద్ధ జీవితం మన ఆరాధన యనంతరం కనపడని యెడల దేవుడు మన ఆరాధనను ద్వేషిస్తారు.

"మీ పండుగ దినములు నేను అసహ్యించుకొనుచున్నాను. వాటిని నీచముగా ఎంచుచున్నాను. మీ వ్రత దినములలో కలుగు వాసనను నేను ఆఘ్రాణించనొల్లను. నాకు దహన

# సత్యవాక్కు

సంపుటి -42 నవంబరు - 2020 సంచిక - 4



NOV 20

నవంబరు - 2020

## క్రైస్తవ మాసపత్రిక

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| గురువారంమధ్యాహ్నం | : | 2.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| శుక్రవారం ఉదయం | : | 6.30 ని॥లకు MAHAA NEWS ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీగూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc. kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

SATYA VANI

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. ph : 0884 - 2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ

ఆంధ్రప్రదేశ్ - 533 001

ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547

ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 నవంబరు - 2020 సంచిక - 4


## పాదములు కడుగుట

యేసుక్రీస్తు సిలువపై మరణించుటకు అప్పగింపబడక ముందు ఒక రోజు తన శిష్యుల పాదములను కడిగిన ఉదంతమును గూర్చి యోహాను సువార్త 13వ అధ్యాయములో మనము చదువగలము. అయితే క్రీస్తు ఎందుకు ఆ పనిని చేసెను? నేటి క్రైస్తవులు కూడ సంఘములో ఒకరి పాదము లొకరు కడుగవలసి యున్నదా? పాదములు కడుగుట యనునది ఆరాధనలో భాగమైయున్నాదా? దీనిని గూర్చి బైబిలు ఏమని చెప్పుచున్నది? ఈ రోజు ఈ అంశమును గూర్చిన సత్యమును తెలిసికొందము.

దేవుని ప్రజలు దేవుని ఆరాధించుటకు కాదుగాని అతిధి సత్కారమునకును, పరిచర్యకును గురుతుగా పాదములు కడుగు అలవాటు కలిగిన వారని బైబిలునందు మనకు కనబడుచున్నది. మమ్రేలో అబ్రాహాముకు కనబడిన ముగ్గురు మనుష్యులను అతడు చూచి, "నేను కొంచెము నీళ్ళు తెప్పించెదను; దయచేసి కాళ్ళు కడుగుకొని ఈ చెట్టు క్రింద అలసట తీర్చుకొనుడి. కొంచెము ఆహారము తెచ్చెదను మీ ప్రాణములను బలపరచుకొనుడి; తరువాత మీరు వెళ్ళవచ్చును" అని

ప్రాధేయపడెను (ఆది 18:4,5). లోతు ఇద్దరు దైవజనులను (దేవుని దూతలను) చూచి, దయచేసి మీ దాసుని యింటికి వచ్చి రాత్రి వెళ్ల బుచ్చి కాళ్లుకడుగు కొనుడి. మీరు పెందలకడనే లేచి మీ త్రోవను మీరు వెళ్లవచ్చు ననెను" (ఆది 19:2).

"యేసు ఒక పరిసయ్యుని యింటికి వెళ్లి భోజన పంక్తిని కూర్చుండగా ఆ ఊరిలో ఉన్న పాపాత్మురాలైన యొక స్త్రీ ఒక బుడ్డిలో అత్తరు తీసికొని వచ్చి వెనుక తట్టు ఆయన పాదముల యొద్ద నిలువబడి యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములను తడిపి, తన వెండ్రుకలతో తుడిచి ఆయన పాదములను ముద్దుపెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను." అందువలన ఆయనను పిలిచిన పరిసయ్యుడు తనలో తాను సణుగుకొనుచుండగా యేసు సీమోనూ, "ఈ స్త్రీని చూచుచున్నావే, నేను నీ యింటిలోనికి రాగా నీవు నా పాదములకు నీళ్ళియ్యలేదు గాని యీమె తన కన్నీళ్ళతో నా పాదములను తడిపి తన తల వెండ్రుకలతో తుడిచెను. ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమె యొుక్క విస్తార పాపములు క్షమించబడెనని" అతనితో చెప్పెను (లూకా 7:36-47).

క్రైస్తవులు కాళ్ళుకడుగు అలవాటును కొనసాగించవలెనని యేసుక్రీస్తు ద్వారా పరిశుద్ధాత్ముడు సెలవిచ్చెను. గాని ఈ కాళ్ళు కడుగుట ఎక్కడ, ఏ సందర్భములో జరిగించవలెనో ఆయన ద్వారా తెలియజేయబడలేదు. యేసు తన శిష్యుల పాదములు కడిగిన తరువాత, ఆయన ఎందుకు ఆ పని చేసెనో వారికిట్లు తెలియజేసెను: "బోధకుడను, ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును, బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయువలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:13-15).

అయితే అపో. పౌలు ద్వారా పరిశుద్ధాత్ముడు ఈ పాదములు కడుగుట, పరిచర్య చేయుట, సత్కరించుట ఎక్కడ జరిగించవలెనో తెలియజేయుచున్నాడు -గృహాములో. సంఘము ద్వారా సంరక్షింపబడగల విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు అతిధ్యమిచ్చి, పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడువారికి సహాయము చేసి ప్రతిసత్కార్యము చేయబూను కొనినదైతే ఆమెను సంఘము పోషించవచ్చునని అతడు తెలియజేసెను (1తిమోతి 5:10).

యేసు సమస్త జనులకు సువార్తను బోధించి, వారికి బాప్తిస్మమిచ్చి, ఆయన బోధించిన వాటినన్నిటిని వారికి బోధించ వలెనని తన శిష్యుల కాజ్ఞాపించెను. ఆయన యిట్లనెను: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19, 20).

యేసు వారికి చెప్పిన సంగతులన్నియు వారికి జ్ఞాపకము చేయు నిమిత్తము పరిశుద్ధాత్మని పంపెదనని ఆయన వారికి వాగ్దానము చేసెను: "ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" అని యోహాను 14:26 లో ఆయన వారికి వాగ్దానము చేసెను. "అయితే, ఆయన అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును" అని యేసు మరల వారికి తెలియజేసెను (యోహాను 16:13).

యేసు అపొస్తలులకు వాగ్దానము చేసిన ఆదరణకర్తను పంపెనా? అవును పెంతెకోస్తు దినమున పరిశుద్ధాత్ముడు పంపబడెను. అయితే ఆయన అపొస్తలులను సర్వ

సత్యములోనికి అనగా యేసు ఆజ్ఞాపించిన వన్నిటిని జరిగించుటకు నడిపించెనా? అవును. అయితే అపొస్తలులు పాదములు కడుగుటయను దానిని సంఘారాధనలో ఒక క్రియగా ఆచరించిరా? లేదు. ఆదిమ క్రైస్తవులు కాళ్ళు కడుగవలెనని అపొస్తలులచే ఆజ్ఞాపింపబడిరా? లేదు. గనుక క్రీస్తుయొక్క శిష్యులు పాదములు కడుగు పద్ధతిని యేసుక్రీస్తు వారికి దైవారాధన క్రియలలో ఒక దానినిగా ఆజ్ఞాపించలేదని మనము గుర్తించవలెను. ఈ పాదములు కడుగు పని గృహములో, అతిథి సత్కారములో ఒక భాగమై యున్నట్లు కూడా దేవుని సత్య వాక్యములో మనము కనుగొంటిమి. గనుక ఆ క్రియను అక్కడే, అనగా గృహములోనే యుంచుట మంచిది.

"దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమో 3:16, 17).

దేవుని వాక్యము పరిపూర్ణమైనది. ప్రతి సత్కార్యమునకు మనలను అది సిద్ధపరచును. అయితే సంఘములో లేక ఆరాధనలో పాదములు కడుగుట ఒక భాగము కాదనియు, అట్టిది క్రీస్తువారు ఉద్దేశ్యము, బోధ కాదనియు మనము గ్రహించవలెను.

ప్రభురాత్రి భోజనమును ప్రతిష్టించిన రాత్రియందే యేసు తన శిష్యుల పాదములను కడిగెను గనుక నేటి క్రైస్తవులు అదే పనిని సంఘములో చేయవలెనని కొందరు తలుస్తూ యుంటారు. అయితే అప్పటికింకా సంఘము స్థాపించ బడలేదని మనము గుర్తుంచుకొనవలెను. అంతేకాదు అపొస్తలులు గాని, ఆదిమ క్రైస్తవులు గాని సంఘములో ఒండొరుల పాదములు కడిగినట్లు క్రొత్త నిబంధనలో ఎక్కడా మనకు కనిపించదు. అయితే ప్రభురాత్రి భోజనమును

నారంభించిన సమయమునందే శిష్యుల పాదములను ఆయన కడిగెను గనుక అదే పనిని సంఘములో మనము చేయవలెనంటే మనము పస్కాను కూడా ఆచరించవలసి యుండును. ఎందువలెనంటే పస్కాను భుజించిన తరువాతనే యేసు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించెను.

ఆదిమ క్రైస్తవులు, అపొస్తులులు పస్కాను భుజించినట్లు క్రొత్త నిబంధనలో కనబడదు. అట్లే పాదములు కడుగుట కూడాను. అయితే వారు ప్రభురాత్రి భోజనము ఎక్కడ ఆచరించిరో అది మనకు తెలియజేయుచున్నది-సంఘములో. కనుక దేవుని వాక్యము ఏక్రియను ఎక్కడ ఉంచుచున్నదో దానిని మనము కూడ అక్కడనే యుంచుదము.

పాదములు కడుగు క్రియలో దోషమేమియును లేదు. గాని దానిని మనమొక ఆరాధన క్రియగా చేసిన యెడల దేవుని ఆరాధనకు మనము కొంత కలిపిన వారమగుదుము. మనదేశ సాంప్రదాయ ప్రకారము దూరమునుండి వచ్చిన వారికి పాదములు కడుగుకొను నిమిత్తము నీళ్ళిచ్చుట మంచిదే. పాత నిబంధనలో ఈ ఆచారమున్నట్లును, క్రొత్త నిబంధన కూడా ఈ క్రియను అతిధి సత్కార క్రియగా, మనకు చూపించుచున్నట్లును కనుగొంటిమి. మనము దేవునికి చేయు పరిచర్య ఆయన అంగీకరించవలెనంటే ఆ పరిచర్యను ఆయన చెప్పినట్లే చేయవలెను. మన సేవను ఆయన అంగీకరించవలెనంటే మన పాదములను కాదుగాని మన పాపములను ఆయన కుమారుని రక్తములో కడుగుకొనవలెనని ఆయన కోరుచున్నారు. ఈ లోక పాపముల నన్నిటిని శుద్ధీకరించు శక్తి క్రీస్తు రక్తములో యున్నది. నీ పాపములను నీవు కడుగుకొని రక్షించబడవలెనంటే, యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముకొనుము. పాపముల విషయమై

మారు మనస్సు పొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును నీవు పొందుదువు. క్రీస్తు సంఘములో యుండి అటు సంఘమునకు పరిచర్య చేస్తూ నీ జీవితమును నమ్మకముగా జీవించుము.

# ప్రార్థన

క్రైస్తవులు దేవునికి చేయు ఆరాధనలో ప్రార్థన ఒక ముఖ్యభాగమైయున్నది. దానియొక్క ప్రాముఖ్యతను బైబిలు వక్కాణించుచున్నది. ప్రార్థన గూర్చిన కొన్ని లేఖన భాగములు గమనించుము. "వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను" (లూకా 18:1). "నిరీక్షణ గలవారై సంతోషించుచు శ్రమయందు ఓర్పుగలవారై ప్రార్థనయందు పట్టుదల గలిగి యుండుడి" (రోమా 12:12). "ఆత్మవలన ప్రతి సమయ మందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు ఆ విషయమైై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (ఎఫెసీ 6:18).

**ప్రార్థన అనగా యేమిటి?**

మొట్టమొదట మనము దేవునితో మాట్లాడు మాధ్యము ప్రార్థన యని గ్రహించుకోవాలి. దేవునియందు సంపూర్ణ నమ్మకంతో ప్రార్థన దేవునికి సమర్పించాలి. అది సరియైన మాటలు ఉచ్చరించుటయే కాదు. అది ఒక మంత్రము వంటిది కాదు. అది మన ప్రవర్తన యొక్క ప్రతిబింబమై యుండాలి. మనము ఎడతెగక నిత్యము ప్రార్థించాలి యని

1థెస్స 5:17 లో పౌలు చెప్పాడు. ఎడతెగక నిత్యము ప్రార్థించాలి యనునప్పుడు మన హృదయము, మనస్సు, జీవితములో ప్రార్థన ఒక సహజ భాగమైనట్లుండాలి. అన్ని వేళలా మనం మన మనస్సులో ఒక నిశ్శబ్ద ప్రార్థన చేసికోవాలి. దేవుని సహాయత కొరకు నడిపింపు కొరకు ఆయన నడగాలి. ఆదిమ సంఘము ప్రార్థనలో ఎడతెగక యుండిరి (అపో.కా. 2:42).

ప్రార్థన ఒక మేజిక్ మంత్రము కాదు. ధనార్జన కొరకు అది ఒక మార్గము కాదు. దేవుడు తన ప్రజల ప్రార్థనలను విందునని వాగ్దానము చేసినను (మత్తయి 21:22), అన్ని సంగతులు ఆయన ఆధీనములో యున్నవని మనం జ్ఞాపక ముంచుకోవాలి.

యాకోబు 4:1-6 లో క్రైస్తవులు దేవుని నడుగుదురు గాని కొన్ని సంగతులు వారు పొందరు అని యాకోబు వ్రాసాడు. వారు తమ స్వార్థము నిమిత్తమై అడుగుదురు గనుక పొందరు అని యాకోబు తెలియజేసాడు. వారు తమ భోగేచ్ఛల నిమిత్తము అడుగుదురు గనుక వారికేమియు లభించదు అని అతడు చెప్పాడు. గనుక ప్రార్థన అనగానే మనం అడిగినవన్నీ ఆయన వెంటనే అనుగ్రహిస్తారని తలంచరాదు.

ప్రార్థన ఒక తుది హెచ్చరిక (Ultimatum) కారాదు. నీవు నన్ను దీవించిన యెడల నేను నీ సేవ చేతుననే షరతులను దేవునికి పెట్టరాదు. ఆయన మనకు చేసిన దానిని బట్టి మనం దేవునికి సేవచేయ బాధ్యులం. గనుక అనర్థమైన వాగ్దానములు చేసి దేవునిని మరింత మనం బలవంతపెట్టలేము. సరిగదా అత్యవసర పరిస్థితుల్లోనే ప్రార్థన చేయడం కూడా సబబు కాదు. కష్టాలు తీరగానే వారు దేవుని

మరచిపోయి తమ గత జీవితాన్నే జీవిస్తుంటారు.

**ఎవరు ప్రార్థించాలి ?**

అందరు ప్రార్థన చేయవచ్చని అనేకులు జవాబిస్తారు. ప్రార్థన చేయడం నేను నిరుత్సాహ పరచను గాని అది దేవుని బిడ్డలకు మాత్రమే రిజర్వు చేయబడిన దీవెన యని మనం గ్రహించాలి. దేవుని అత్మీయ కుటుంబమునకు చెందని వారి యొుక్క ప్రార్థనలను దేవుడు ఆలకించుననే నిర్ధారణ యేమీ లేదు. "భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు. నీతిమంతుల ప్రార్థన ఆయన ఆలకించును" (సామె 15:29). 1పేతురు 3:12లో పేతురు కీర్తన 34లో చెప్పబడిన మాటలను ఎత్తి చూపిస్తాడు. "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి". వీటితో మరికొన్ని వచనములను కూడ మనము జత చేయవచ్చును. అయితే ప్రార్థనను గూర్చి వ్రాయబడిన వచనము లన్నియును దేవుని బిడ్డల కొరకే వ్రాయబడినవని గమనించుము. అంతేకాకుండా నీతిగా జీవించు క్రైస్తవులకే ప్రార్థించే అర్హత యున్నదని తెలిసికొనుము. "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (1యోహాను 3:22). ఆయన ఆజ్ఞలను గైకొనువారి ప్రార్థనలనే దేవుడా లకించునని యోహాను వ్రాసిన సంగతిని గమనించుము.

క్రైస్తవులు ఒకరి కొరకు ప్రార్థించవలెనని ఆజ్ఞాపింపబడి యున్నారు. "మీ పాపములను ఒకరితో ఒకరు ఒప్పుకొనుడి. మీరు స్వస్థత పొందునట్లు ఒకరి కొరకొకరు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన

మన:పూర్వకమైనదై యుండును" (యాకోబు 5:16). క్రైస్తవులందరి నిమిత్తమై ఈ మాటలు వ్రాయబడెను. మరియు నీతిమంతుని ప్రార్థన బలము గలదై యుండునని చెప్పబడియున్నది. అతడు బోధకుడే కానక్కరలేదు. మనం ఒక గురువు దగ్గర పాపములు ఒప్పుకొనాలని ఎక్కడా లేదు. ఒక మనుష్యుని జీవితం ముఖ్యము. అతని ఉద్యోగము కాదు. విధేయతకు బదులు ప్రార్థన సరికాదు. కొన్ని సందర్భాల్లో దేవుడు ప్రార్థన ఇక చాలునని చెప్పినట్లు చూడగలము (నిర్గమ 14:15, అపో.కా. 22:16).

"కావున ప్రతి స్థల మందును పురుషులు కోపమును సంశయమును లేనివారై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నానని" అపో.పౌలు చెప్పాడు (1తిమో 2:8). గ్రీకు భాషలో ఇక్కడ వాడబడిన పురుషులు అను పదమునకు పురుషులు మాత్రమే అను భావము వచ్చును. స్త్రీలకు, మానవజాతికి వాడబడిన పదములు వేర్వేరు. గనుక బహిరంగ ప్రార్థనలు పురుషులు మాత్రమే చేయవలెనని పౌలు విశద పరచుచున్నాడు. చేతులెత్తి ప్రార్థన చేయుటను గూర్చి ప్రజలు తరుచు అడుగుదురు. చేతులు పైకెత్తి ప్రార్థన చేయుటలో తప్పేమీ లేదుగాని, అట్లు చేయాలనేది ఆజ్ఞ కాదు. లేఖనాల్లో ప్రార్థన చేయువారు వివిధ భంగిమలలో యుండినట్లు గమనించగలము. గాని చాలాసార్లు వారు సాష్టాంగా పడినట్లును, మోకాళ్లూనినట్లును గమనించ గలము. మనం ప్రార్థన చేయునప్పుడు శారీరక భంగిమ ముఖ్యము కాదు. మన జీవితములు పరిశుద్ధముగా యుండాలని పౌలు హెచ్చరిక చేసాడు.

**మనము దేనిని గూర్చి ప్రార్థించాలి ?**

మన ప్రార్థనలో అనేక సంగతులు

ఇమిడియున్నాయి. ముఖ్యముగా ప్రార్ధనలో మనం దేవునికి స్తుతులు చెల్లించాలి. తదువరి ఆయన భౌతికంగాను, ఆత్మీయం గాను అనుగ్రహించిన దీవెనల కొరకు కృతజ్ఞత చెల్లించాలి. "దేనిని గూర్చియు చింత పడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్ధన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధ ఎ యేసు క్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:6-7). ప్రార్ధనలయందు నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై దానియందు మెలకువగా ఉండుడి" (కొలస్స 4:3). వ్యక్తిగత అవసరములను కూడ పౌలు ప్రార్ధనలో ఇమిడ్చి యున్నాడని గమనించుము. వ్యక్తిగత అవసరముల కొరకు ప్రార్థించుట స్వార్ధముకాదు, పాపము కాదు. మనం దేవుని జ్ఞానముకొరకు, నడిపింపుకొరకు అడగాలి (యాకోబు 5:16).

మన ప్రార్ధనలలో ముఖ్యమైనది ఒప్పుకోలు, మన విశ్వాసాన్ని, పాపములను ఆయన యెదుట ఒప్పుకోవాలి. మన పాపములను ఒప్పుకొనిన యెడల దేవుడు నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించును (1యోహాను 1:8). ఒప్పుకోలుతో మారుమనస్సు జోడించి యున్నదని గ్రహించాలి. మనం బీదల కొరకు, రోగుల కొరకు, రాజుల కొరకు, ఇతర క్రైస్తవుల కొరకు ప్రార్ధించాలి (యాకోబు 5:16). దేవుని క్షమాపణ అడిగినప్పుడు మనం కూడా యితరుల అపరాధములను క్షమించాలి. ఇతరులను మనం క్షమించకపోతే దేవుడు కూడా మనలను క్షమించరు (మత్తయి 11:16).

మన మెట్లు ప్రార్థించాలి?

మన మనస్తత్వము ప్రార్థనలో అతి ప్రాముఖ్యమైనది. దేవునియందు బలమైన విశ్వాసముతో, నిష్కపట హృదయముతో మనం ప్రార్థించాలి. “ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనవరుచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది” అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 15:9). నిష్కపట హృదయంతో ప్రార్థించునప్పుడు వినయ భావన కలిగి సరియైన ఉద్దేశ్యముతో ప్రార్థించాలి. పొడవుపాటి ప్రార్థనలు చేయనవసరము లేదు. వ్యర్థమైన మాటలు పలుకు సుదీర్ఘ ప్రార్థనలు యేసు ఖండించారు (మత్తయి 6:5-8). గొప్ప విశ్వాసులు చేసిన ప్రార్థనలు బహు స్వల్పమైనవే. మనం భక్తితో దేవుని ప్రార్థించాలి. దేవుడు దేవుడని మనం మానవ మాత్రులమని జ్ఞాపకముంచువాలి. “నీవు దేవుని సన్నిధిని అనాలోచితముగా పలుకుటకు నీ హృదయమును త్వరపడ నియ్యక నీ నోటిని కాచుకొనుము. దేవుడు ఆకాశమందున్నాడు. నీవు భూమిమీద ఉన్నావు. కావున నీ మాటలు కొద్దిగా ఉండనిమ్ము” (ప్రసంగి 5:2).

మనం మనకును, దేవునికిని మధ్యవర్తియైన యేసు ద్వారా ప్రార్థించాలి. “దేవుడొక్కడే, దేవునికి మనుష్యునికి మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తు యేసను నరుడు” అని పౌలు చెప్పాడు (1తిమో 2:5). ఇద్దరు వ్యక్తుల మధ్య సంధి కూర్చువాడు మధ్యవర్తి. ఇక్కడ దేవునికి మానవునికి మధ్యవర్తి అవుసరం. మధ్యవర్తి ఇరుపక్షాల యున్నవారిని క్షుణ్ణంగా ఎరిగినవాడై యుంటాడు. గనుక యేసు క్రీస్తు కంటే శ్రేష్టమైన మధ్యవర్తి మానవులకు లేడు. ఆయన దేవుడు గనుక దేవుని ఎరిగిన వాడు; ఆయన మానవావతారి యయ్యారు. గనుక దేవుని మానవుని కూడా బాగుగా

ఎరుగును (ఫిలిప్పీ 2:5-11). మన ప్రార్థనలు దేవునికి చేర్చుటలో పరిశుద్ధాత్ముడు కూడ పాత్ర కలిగియున్నారని పౌలు చెప్పుచున్నాడు. "అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయు చున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని ఉచ్చరింప శక్యముగాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు" (రోమా 8:26-27). ఈ మూలుగులు మానవునివి కాదు గాని అవి ఆత్మ యొక్క మూలుగులు. ఆత్మ చేయు ప్రతీది మనకు గ్రాహ్యము కాకపోవచ్చును. గాని ఆత్మయును క్రీస్తును మన విజ్ఞాపనలను దేవుని యెదుట మన కొరకు సమర్పించుదురు. యిది మనకు గొప్ప ప్రోత్సాహకారణము.

మన ప్రార్థనల విషయంలో మనం చేయగలిగినదంతా చేయుదుమని పేతురు చెప్పు చున్నాడు. మనం యేమీ చేయకుండా యితరులకు సహాయం చేసే సాధనం ప్రార్థన కాదు. ఇట్టి స్వభావమును గూర్చి యాకోబు హెచ్చరించాడు. "సహోదరుడైనను, సహోదరి యైనను దిగంబరులై అనాటికి భోజనము లేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక, సమాధానముగా వెళ్లుడి చలి కాచుకొనుడి, తృప్తి పొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము?" (యాకోబు 2:16-17). ఇంకో మాటలో మనం ప్రార్థన మాత్రం చేసి, వారికి సహాయం చేయకపోతే అవి నిష్ప్రయోజనము. దేవుడు తన సేవకుల ద్వారా ప్రార్థనలకు జవాబిచ్చును. గనుక యితరులకు సహాయం యేమీ చేయక కేవలం ప్రార్థన చేసేసి, మనం మన బాధ్యతను నిర్వర్తించామని తలంచరాదు.

– జెర్రీ బేట్స్

# రోమన్ కేథలిక్కు సంఘము

## (The Roman Catholic Church)

**పరిచయము :**

రోమన్ కేథలిక్కు సంఘములో ఐదు ప్రత్యేకతలున్నాయి.

1. అది ప్రపంచములో ఉద్భవించిన పురాతన డినామినేషన్.
2. అది డినామినేషన్లు అన్నింటికీ తల్లి.
3. అది ప్రపంచములో యున్న అతిపెద్ద డినామినేషన్.
4. అది ప్రపంచమందున్న అతిశక్తి వంతమైన డినామినేషన్ .
5. అది ప్రపంచములో యున్న అత్యంత అవినీతి సహితమైన డినామినేషన్.

అది ఎంత మత సంబంధమైన సంస్థయో అంత రాజకీయమైనది.

**I. రోమన్ కేథలిక్కు సంఘము యొక్క ప్రారంభము, చరిత్ర:**

సత్యవాక్యము నుండి వైదొలగి ప్రజలు విశ్వాస భ్రష్టులగుదురని యేసుక్రీస్తు, అపో.పౌలు, పేతురు మొదలగు క్రొత్త నిబంధన లేఖకులు ముందుగనే ప్రవచించిరి. (మత్తయి 7:13-23; అపో.కా. 20:28-32; 2థెస్స 2:1-12; 1తిమో 4:1-5; 2పేతురు 2:1-3; యూదా 1:3-4).

కొందరు విశ్వాస భ్రష్టులగుదురని, నాశన పాత్రుడగు పాప పురుషుడు బయలు వెళ్లునని పౌలు చెప్పాడు (2థెస్స 2:1-12). కొందరు వివాహమును నిషేధింతురని, కొన్ని ఆహారములను నిషేధింతురని పౌలు చెప్పాడు ( 1తిమో 4:1-5).

**II. రోమన్ కేథలిక్కు సంఘము క్రొత్త నిబంధన సంఘము నుండి ఉద్భవించినది. దాని నుండి పాడైపోయిన సంస్థ అది:**

అది క్రీ॥శ॥ 1054లో చీలికలాయెను. ఆచీలిక ఆరాధనలో ప్రతిమలను వినియోగించుటను గూర్చినట్టిది. తూర్పు ప్రాంత

సంఘము ఆరాధనలో ప్రతిమల నుంచుటను వ్యతిరేకించెను. పశ్చిమ ప్రాంత సంఘము గ్రీక్ ఆర్థోడాక్స్ సంఘమని పిలువబడెను. మిగిలిన వారు రోమన్ కేథలిక్కు లయ్యిరి. 16వ శతాబ్ధములో ప్రారంభమైన పొటస్టాంటు సరరణోద్యమము రోమన్ కేథలిక్కుల యొక్క నడ్డివిరిచెను.

**రోమన్ కేథలిక్కులు కొంత సత్యమును బోధిస్తారు:**

వారు దేవుడొక్కడేయని, దైవత్వములో ముగ్గురు మూర్తులున్నారని బోధిస్తారు. బైబిలు దైవావేశ గ్రంధమని బోధిస్తారు. వారు పరలోకము, నరకము శారీరక పునరుత్థానమున్నదని బోధిస్తారు. తీర్పును కూడా వారు సమర్థిస్తారు. వారు విడాకులను వ్యతిరేకిస్తారు, కుటుంబ పరిశుద్ధతను గౌరవిస్తారు. వారు మానవ ప్రాణముకు ఎక్కువ విలువనిస్తారు, భ్రూణహత్యలను (ఎబార్షన్లను) వ్యతిరేకిస్తారు. సునాయాస మరణము (Euthanasia) ను వ్యతిరేకిస్తారు.

**III. రోమన్ కేథలిక్కు సంఘము అనేక అసత్యాలను బోధిస్తారు:**

వారొక్కరు మాత్రమే అపొస్తులులతో ఏర్పడిన సంఘమని వారు చెబుతారు.

క్రీ॥శ 1302లో బోనిఫేస్ VIII అను వాడిట్లు చెప్పాడు: "కేథలిక్ సంఘముకు వెలుపల రక్షణలేదు, పాపక్షమాపణ లేదు. ప్రతి మానవుడు రక్షింపబడాలంటే రోమన్ కేథలిక్కులు పోపుకు లోబడాలి". ఏద్దైనా సంఘము క్రీస్తు సంఘము కావాలంటే ప్రతి విషయములోను క్రొత్త నిబంధన మాదిరికి సరిపోవాలి. రోమన్ కేథలిక్కు సంఘము క్రీస్తు సంఘముతో సరితూగదు.

**కృప పొందడానికి 7 సంస్కారములు (sacraments) ఉన్నాయని వారు బోధిస్తారు. సంస్కారమను మాట బైబిలులో లేదు:**

అవి: బాప్తిస్మము, జపము, నిర్ధారణ, పరిశుద్ధ బల్ల (Holy Eucharist); తైలాభిషేకము (Extreme Unction)పవిత్ర హెచ్చరికలు (Holy orders), వివాహము అనునవి.

**పారం పర్యములు, పోపుల యొక్క ఆజ్ఞలు, సంఘ కౌన్సిళ్ల తీర్మానములు బైబిలుతో సరిసమానమైనవని వారు బోధింతురు:**

1. "పరదైసునుండి బయలు వెళ్లిన రెండు పవిత్రనదులవలె బైబిలులోను, సంఘ పారం పర్యములలోను దేవుని వాక్యమున్నది. ఈ రెంటిలోను మాకు పారం పర్యమే విశదముగాను, ముఖ్యముగాను యున్నది. అది క్షేమము కూడాను" (Catholic Belief by J.J Burton, page 33).

2. రక్షింపబడడానికి యేమి చేయాలో బైబిలు ఒక్కటి మాత్రమే మనకు సంపూర్తిగ తెలియ జేయుచున్నది. (2తిమో 3:16-17; 2పేతురు 1:3; యూదా 1:3).

3. మనం బైబిలుకు కలుపకూడుదు, దానినుండి తీసివేయకూడదు, దానికంటే మిన్నగా పోకూడదు (ద్వితీ 4:2; సామె 30:6; 2యోహాను 1:9-11; ప్రక 22:18,19; గలతీ 1:6-9).

4. మానవ కల్పిత సిద్ధాంతములను, ఆజ్ఞలను పారం పర్యములను పాటించుట వలన దేవుని వాక్యము నిరర్ధకమగును (మత్తయి 15:9,13,14).

5. ఒకడు బైబిలును చదువగా తనకు తాను గ్రహించుకోగలడు (యోహాను 5:39; అపొ.కా. 17:11; ఎఫెసీ 3:3-4).

**సంఘము పేతురు అను బండపై నిర్మించబడినదని వారు నమ్మెదురు:** (మత్తయి 16:16-19)

1. పేతురు (కేఫా) అనగా రాయి అని అర్థము (యోహాను 1:42).

2. మత్తయి 16:18 లో రెండు పదములు వినియోగించబడెను.

అవి పెట్రొస్ (petros) అనగా చిన్నరాయి యని అర్ధము, యిది పేతురు అను పదము యొక్క భావము. పెట్రా (petra) అనగా ఒక పెద్దకొండ లేక బండ. దానిపై సంఘము నిర్మించబడెను. ఈ బండ మీద నా సంఘమును కట్టుదును అనగా, "యేసు క్రీస్తు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు" అను గొప్ప సత్యముపై సంఘము నిర్మించబడెను (మత్తయి 16:16-18; అపో.కా. 4:11-12; 1కొరింధీ 3:11;10:4; ఎఫెసీ 2:19-22; 1పేతురు 2:3-8).

పేతురు మొట్టమొదటి పోప్ అని, పాపములు క్షమించడానికి లేదా నిలిపివేయడానికి తనకు, తదుపరి పోపులకు అధికారము కలదని కేథలిక్కులు బోధిస్తారు :

"పరలోక రాజ్యపుతాళపు చెవులు నీకిచ్చెదనని" యేసు పేతురుతో చెప్పారు నిజమే, ఆ తాళపుచెవిని వినియోగించి పెంతెకోస్తు దినమున యూదులను, కొర్నేలి యింటివారైన అన్యజనులకు దేవుని రాజ్యము (సంఘము) లో ప్రవేశించుటకు షరతులను పేతురు తెలియజేసాడు (మత్తయి 16:19; అపో.కా. 2;10 అధ్యా). బంధిచడానికి విప్పడానికి యున్న అధికారము పేతురుకే కాదు గాని మిగతా అపొస్తలుల కందరికి ఇయ్యబడెను (మత్తయి 18:18).

**దిగువ 7 కారణములు వలన పేతురు పోపు కాజాలడు:**

1. అతడొక సంఘపెద్ద, పెద్దలకు పెద్దకాదు (1పేతురు 5:1).
2. అతడు పాపభూయిష్టుడు, పొరబాట్లు చేయు మానవుడు (మత్తయి 26:31-35; 69-75; గలతీ 2:11-14).
3. తనను ఆరాధించుటను అతడు తిరస్కరించాడు. (అపో.కా. 10:25-26).
4. అతడు వివాహితుడు (మత్తయి 8:14-15; 1కొరింధి 9:5).

5. సంఘమునకు శిరస్సు క్రీస్తే గాని మానవుడు కాదు (ఎఫెసీ 1:22,23; కొలస్స 1:18).

6. పేతురు ఎప్పుడైన రోమాకు వెళ్లినట్లు చరిత్రాధారములు యేమిలేవు.

a. పేతురు ఎన్నడైనా రోమాలో యుంటే పౌలు రోమీయులకు వ్రాస్తు పేతురును గూర్చి ఎక్కడా చెప్పలేదు, ఆశ్చర్యము కాదా?

b. పారంపర్యము ప్రకారము పేతురు ఎన్నడైనా రోమాలో యుంటే అతడు అక్కడ పోపు అని యర్ధముకాదు.

7. క్రీస్తు అనే బండమీద సంఘము స్థాపించబడెను. పేతురుపై కాదు.

**కేథలిక్కులు మరియహారాధనను కొనసాగింతురు; మరియును ఆరాధింతురు :**

మరియ "దేవుని యొక్క తల్లి" యని వారునమ్ముదురు. పరిశుద్ధాత్ముడు మరియ యొక్క "భర్త" అయితే, ఆమెకు ఇద్దరు భర్తలున్న ట్లగును. అయితే ఆమె దేవుని యొక్క తల్లియని లేఖనములు ఎన్నడు ఎక్కడా చెప్పలేదు. మరియ దేవునికి "మధ్యవర్తిరాలు" అని కేథక్కులు నమ్ముదురు. గాని యేసు దేవునికి మానవునికి మధ్యవర్తియని బైబిలు చెప్పుచున్నది (1తిమో 2:5). మరియ "ఆదిమ పాపముతో" పుట్టలేదని వారు బోధిస్తారు. ఆమె పాప రహితమైన గర్భధారణి" (Immaculate Conception) యను సిద్ధాంతమును వారు చెబుతారు, అయితే ఆదిమ పాపమును గూర్చి గాని, పై సిద్ధాంతమును గూర్చి గాని బైబిలు ఎక్కడా బోధించులేదు (రోమా 3:23; 1యోహాను 3:4; యెహెజ్కేలు 18:20). మరియ మరణమును చూడకుండా శరీరముతో పరలోక మునకు ఎక్కిపోయెనని కేథలిక్కులు బోధిస్తారు. (హెబ్రీ 9:27; 1కొరింథీ 15:50 చదువుము). మిగతా స్త్రీలకు అతీతముగా యేసు ఎన్నడు మరియను హెచ్చించలేదు

(యెహాహాను 2:3-5; లూకా 11:27-29). కడపటి వరకు మరియ కన్యగానే (Perpetuall virgin) యుండెనని వారు బోధింతురు. బైబిలు అయితే ఆమెకు ఇంకా పిల్లలు కలిగిరి యని బోధించుచున్నది. (మత్తయి 1:25; 13:35,56; యోహను 7:3-5, గలతీ 1:19; యూదా 1:1).

**కేథలిక్కులు మృతులైన పరిశుద్ధులను ఆరాధిస్తారు:**

'పరిశుద్ధులు' పరలోకానికి ఎక్కువ ఘనతను తీసికొని వచ్చారని వారు బోధిస్తారు. పరలోకంలో యున్న పరిశుద్ధులు వీరి ప్రార్ధనలు విని సహాయం చేస్తారని వారు నమ్ముదురు. బైబిలు ఇట్టివేమీ బోధించుటలేదు, యేసు క్రీస్తు ఉపదేశించిన దానికి ఇదంతా విరుద్ధము, యేసు క్రీస్తు మన ప్రధాన యాజకుడు, ఉత్తరవాది, మధ్యవర్తి. ఆయన రక్తము మన ప్రతి పాపమును శుద్ధి చేయును (హెబ్రీ 4:14-16; 1తిమో 2:5; 1యోహాను 1:2:1-2).

**కేథలిక్కులు తమ సభ్యులను స్వాములు, సామాన్యులు (Clerpy &Laity) అని విభజింతురు:**

బైబిలు అట్టి భేదము నేమిూ చూపించుట లేదు. క్రైస్తవులందరు యాజకులే (1పేతురు 2:5-9; ప్రక 1:6).

**కేథలిక్కులు పర్గేటరీ అనే సిద్ధాంతమును బోధింతురు:**

పరలోకమునకు వెళ్లుటకు అర్హతలేని కేథలిక్కులు 'పర్గేటరి' అనే తాత్కాలిక ప్రదేశములో యుండి తమ పాప విమోచన కొరకు కనిపెట్టుదురు. భూమి మీద బ్రదికియున్న తమ బంధువులు వారి కొరకు యాగములు, ప్రార్ధనలు చేస్తేవారు ఆ స్థావరము నుండి పరలోకానికి వెళ్లుదురు! పర్గేటరీ అనే ఈ సిద్ధాంతమును బైబిలు ఎక్కడా బోధించుటలేదు. పాపక్షమాపణ పత్రముల వలన ఇట్టివారి ఆత్మలు త్వరగా విడుదల చేయబడునని

వారు బోధిస్తారు. ఒకడు మరణించిన తరువాత వానికి రెండో తరుణం అంటూ యేమీ లేదని బైబిలు బోధించుచున్నవి. ఒకడు మరణించగా అతని నిత్య గమ్యము ముద్ర వేయబడును (హెబ్రీ 9:27; లూకా 16:19-31).

ప్రభు రాత్రి బోజనములో యున్న రొట్టె, ద్రాక్షారసములు క్రీస్తు యొక్క శరీరముగాను, రక్తముగాను మారునని వారు బోధిస్తారు. దీనిని Tran substantiation అంటారు:

ఇది నా శరీరము, ఇది నా రక్తము అని యేసు చెప్పినప్పుడు ఆయన ఆ పదములను రూపకాలం కారముగా వాడెను. ఆయన ప్రభురాత్రి భోజనమును ప్రతిష్టించినప్పుడు ఇంకను సజీవునిగానే యుండి, తన శరీరములో ఆయన రక్తము ప్రసరించుచుండెను. ప్రభురాత్రి భోజనము ఒక జ్ఞాపక చిహ్నము, అదొక బలికాదు.

కేథలిక్కులు రక్షణ సంకల్పమును బోధించరు:

ఆదిమ పాపమున్నదని వారు నమ్ముదురు (ద్వితీ 24:16; యెహెజ్కేలు 18:20; 1యోహాను 3:4; యాకో 4:7). వారు పసి పిల్లలకు బాప్తిస్మమిత్తురు ( రోమా 10:17; యోహాను 8:24; మత్తయి 10:32; లూకా 13:3; మార్కు 16:16; అపో.కా. 8:12). వారు బాప్తిస్మముగా చిలకరింపు ఇస్తారు(రోమా 6:4; కొలస్స 2:12; అపో.కా. 8:36-39).

ముగింపు :

క్రీ॥శ 1545 నుండి 1563 వరకు కూడుకొనుచు వచ్చిన కౌన్సిల్ ఆఫ్ ట్రెంట్ కేథలిక్కుల సిద్ధాంతములను సమర్ధించెను. పోపు తన సింహాసనము మీద నుండి పలికినది వారు బోధించుదానిని 1870 లో ప్రాచుర్యము చేసారు. కేథలిక్కులు

కాని వారు కూడ ఇట్టి అబద్ధ సిద్ధాంతములను సమర్ధించారు. వారి చేతులలో బైబిలు లేకుండా పోపులు ఆదేశించారు గనుక ప్రజలు సత్యము నెరుగక యుండిరి.

**కేథలిక్కులు :**

క్రిస్మసును క్రీస్తు జన్మదినమంటారు ఈస్టరుకు ముందు లెంట్ సీజన్‌ను పాటిస్తారు ఈస్టరు ఆదివారం క్రీస్తు యొక్క పునరుత్థానదినమంటారు కొంతమంది ప్రముఖలకు వారు "పరిశుద్ధులు" (Saints) అను బిరుదునిస్తారు. (1కొరింథీ 1:2; 6:11). ఇవన్నీ బైబిలు విరుద్ధములే.

**కేథలిక్కులు ప్రపంచ మంతటా వెయ్యి కోట్లమంది ఉంటారు.**

వారు ఇంచుమించు 200 దేశాల్లో యున్నారు.

**కేథలిక్కులలో చాల మార్పులు జరుగుచున్నాయి:**

కార్డినల్ గిబ్బన్స్ అనువాడు కేథలిక్కుల సంఘము ఎన్నడు మార్పు జెందనిదియని చెప్పాడు. వారి పూజలన్నియు ఇదివరకు మాతృభాషలో లాటిన్‌లో జరిగేవి గాని ఇప్పుడు స్థానిక భాషలలో జరుగుచున్నవి. సామాన్య సభ్యులు తమ పాపములను కూర్చువి స్వామి వారి చెవిలో ఇప్పుడు ఒప్పుకొనవచ్చును. సన్యాసత్యమును గూర్చి, ఎబార్షన్లను గూర్చి, కుటుంబ నియంత్రణను గూర్చి ఇప్పుడు వారు విమర్శలను ఎదుర్కొను చున్నారు. సామాన్య సభ్యులకు ఇప్పుడు రొట్టె ద్రాక్షా రసమును కూడ యిచ్చుచున్నారు. గతంలో రొట్టె మాత్రమే ఇచ్చేవారు, ద్రాక్షరసం స్వాములవారు సేవించేవాడు: St. క్రిస్టాఫర్ అనునతని Saint అను బిరుదును వారు వెనక్కి తీసేసారు. గతంలో శుక్రవారం మాంసము తినకూడదనే అజ్ఞను వారు విరమించుకొన్నారు.

**–రాడ్ రూథర్‌ఫర్డ్**

సత్యవాణి కార్యక్రమమును ఇప్పుడు MAHAA NEWS ఛానల్ లో ప్రతి శుక్రవారం ఉదయం 6:30 గII లకు చూడండి.

# సంక్షిప్త వార్తలు

2020 వ సంవత్సరములో గత పది మాసములలోను మనందరినీ కాపాడి ఆయురారోగ్యముల నిచ్చిన దేవునికి స్తోత్రములు. కరోనా కోవిడ్-19 ప్రపంచ వ్యాప్తముగా ప్రబలి ఇప్పటికి 11 నెలలు కావచ్చుచున్నది. దాని ఆరంభ దశలో లాక్‌డౌన్ వలన విశ్వవ్యాప్తముగా క్రీస్తు సువార్త పనికి సంఘములు సమాజముగా కూడి ఆయనను ఆరాధించుటకు కొంత విఘాతము ఏర్పడినను, క్రైస్తవులలో విశ్వాసము మాత్రము బలహీనపడలేదు.

స్థానిక క్రీస్తు సంఘములు తమ తమ యిండ్లలోనే ఆరాధన జరిపించుకొనిరి. కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘమయితే లాక్‌డౌన్ నిశితముగా ప్రభుత్వము వారు అమలు పరచుచున్నను సమాజముగా కూడుకొని దేవుని ఆరాధించుటకు వెనుకాడ లేదు. కొన్ని గృహములలో సహోదరులు గృహారాధన జరిపించుకొనిరి. ప్రతి ఆదివారము రొట్టెవిరుచుట విస్మరించలేదు. ఈ వార్తలు వ్రాయుసరికి లాక్‌డౌన్ నిబంధనలు చాలమట్టుకు సడలించబడినవి. స్థానిక సంఘములు ఆరాధనకు ఇంతకు ముందువలే కూడుకొనుచున్నవి. అందుకు ప్రభువుకు స్తోత్రములు.

2020 అక్టోబరు 9వ తేదీనాడు రిక్కీగూటం గారు పల్లంకుర్రులో జరిగిన సువార్త కూటములో వాక్యపరిచర్య చేసిరి. అక్కడ చాల కాలముగా బూల యోహాను గారు, వారి కుమారుడు చిరంజీవి గారు క్రీస్తుకొరకు పని చేయుచున్నారు. తిరుగు ప్రయాణములో రిక్కీగూటం గారు ముమ్మిడివరం మండలంలో యున్న అనేక స్థానిక సంఘములను దర్శించి ప్రభువునందు వారిని బలపరచిరి.

2020 అక్టోబరు 13-14 తేదీలలో రిక్కీగూటం గారు పాయకరావుపేట మండలం వెంకటాపురంలోను, నర్సీపట్టణం మండలం చింతలపూడిలోను, ఆ పరిసర ప్రాంతములలోను స్థానిక సంఘములలో సువార్త కూడికలు నిర్వహించి సహోదరులను విశ్వాసమునందు బలపరచిరి. ఆ ప్రాంతములో పలుచోట్ల రిక్కీగారి ద్వారా క్రీస్తు సంఘ ఆలయములు నిర్మించుట జరిగినది. మరికొన్ని చోట్ల మంచినీటి బోర్లు వేయించుట జరిగినది.

2020 అక్టోబరు 19వ తేదీనుండి రిక్కీగారు కుటుంబ సమేతముగా తెలంగాణాలో పర్యటించుచుండిరి. 25వ తేదీ ఆదివారము ఆయన నిజామాబాద్‌లో పర్యటించి మూడు దశాబ్ధముల క్రితము యన్.టైటస్ గారు, జాషువా గారు స్థాపించిన సంఘములలో కొన్నింటిని దర్శించిరి. అక్కడ ఇంచుమించు 8 స్థానిక సంఘములను సహో.టైటస్ గారు స్థాపించి చక్కటి ఆలయములను నిర్మించిరి. 2000 సం॥లో ఆయన ప్రభువునందు నిద్రించినను, ఆ పనిని ఆయన కుమారుడు ఎబినేజర్ గారు సమర్ధవంతముగా నడుపుచున్నారు.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్ నిరాటంకముగా జరుగుచున్నది. విద్యార్ధులు వ్యక్తిగతముగాను, ఆన్‌లైన్ లోను హాజరు కావచ్చును. వివరములకు సత్యవాణి ఆఫీసును సంప్రదించండి.

సత్యవాణి T.V కార్యక్రమములను ఇప్పుడు ప్రతి శుక్రవారం ఉదయం 6:30 గం॥లకు MAHAA NEWS ఛానల్ లో చూడండి.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

**సత్యవాక్కు**
**పోస్టుబాక్సు-80**
**కాకినాడ - 533 001**
**ఆంధ్రప్రదేశ్**

**ప్రచురణ తేదీ: ప్రతీ నెల 9వ తేదీ**
**పోస్టు చేయు తేదీ: ప్రతీ నెల 15వ తేదీ**

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ 533004